క్లుప్తంగా

వాసవీ శాంతిధామంలో కర్ణాటక భక్తుల పూజలు



పెనుగొండ వాసవీ శాంతిధామంలో వాసవీ హోమం నిర్వహిస్తున్న కర్ణాటక భక్తులు

పెనుగొండ: అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతిధాంలో కర్ణాటక భక్తులు పూజలు నిర్వహించారు. ఆదివారం ఆలయ అర్చకుడు శిష్టా మణికంఠ ఆధ్వర్యంలో గోపూజ, వాసవీ శాంతి హోమం, 102 అడుగులు వాసవీ మాతకు, మరకత శిల వాసవీ మాతకు అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం దంపతుల పూజలు, నగరేశ్వరుని స్వయం అభిషేకాలు నిర్వహించారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీల అందజేత



కొప్పర్రు అంగన్ వాడి కేంద్రంలో కుర్చీలను బహూకరిస్తున్న మాజీ ఉప సర్పంచ్ సురేష్.

నరసాపురం రూరల్: మండలంలోని కొప్పర్రు బద్ధావారిపేట అంగన్‌వాడీ స్కూల్ విద్యార్థులకు కుర్చీలను మాజీ ఉపసర్పంచ్ రావూరి సురేష్ కుమార్ ఆర్థిక సహకారంతో పంపిణీ చేశారు. ఆదివారం జరిగిన నిర్వహించిన సమావేశంలో అంగన్‌వాడీ కార్యకర్తకు చిన్నారుల కూర్చీలను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ నల్లి వరలక్ష్మీజేమ్స్, ఎంపీటీసీ సభ్యురాలు బద్దా శాంతకుమారి, విద్యా కమిటీ చైర్మన్ పోలిశెట్టి కొండ, తిరుమాని నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలి



ర్యాలీ ప్రారంభిస్తున్న దృశ్యం

నరసాపురం: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కవురు పెద్దిరాజు డిమాండ్ చేశారు. ఆ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం సంఘం ఆధ్వర్యంలో నరసాపురం మండలం కొప్పర్రు, సరిపల్లి, లిఖితపూడి మీదుగా పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్ వరకూ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ సెంటర్‌లో జరిగిన సభలో పెద్దిరాజు మాట్లాడుతూ అన్ని పంటలకు రైతులకు కనీస మద్దతు ధర దక్కేలా చూడాలని, కార్మికుల ప్రయోజనాలకు విఘాతం కలిగించే లేబర్ కోడ్లు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఎం.రామాంజనేయులు, ఎం.త్రిమూర్తులు, కె.బాలరాజు, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లలో నాణ్యతను పాటించాలి



హోటల్స్ అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతున్న పైబోయిన రఘు

తాడేపల్లిగూడెం: వినియోగదారులకు నాణ్యతతో కూడిన మంచి ఆహార పదార్థాలను అందించాలని పట్టణ హోటల్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు పైబోయిన రఘు సూచించారు. అసోసియేషన్ సమావేశం ఆదివారం పట్టణంలోని ఒక హోటల్‌లో నిర్వహించారు. రఘు మాట్లాడుతూ కోవిడ్ తర్వాత ఆహార పదార్థాలపై ప్రజల్లో అవగాహన పెరిగిందన్నారు. ప్రభుత్వ అధికారుల తనిఖీలు పెరిగాయన్నారు. అనుకూలమైన ధరను నిర్ణయించుకుని మంచి ఆహార పదార్థాలను మాత్రమే వినియోగదారులకు విక్రయించాలన్నారు. మార్కెట్‌లో పోటీ పెరిగింది కదా అని, గిట్టుబాటు కాకుండా తక్కువ ధరలకు పదార్థాలను విక్రయించుకుని నష్టపోవద్దన్నారు. ఈ మధ్య కాలంలో మసీదు రోడ్‌లో ఒక హోటల్ యజమాని ఆర్థిక ఇబ్బందుల వల్ల అదే హోటల్‌లో ఆత్మహత్య చేసుకున్న సంఘటనను మరవద్దన్నారు. పోటీతత్వం ఉండాలి కానీ, మన వ్యాపారాలు దెబ్బతినే విధంగా వ్యాపారాలు చేయవద్దన్నారు. ప్రభుత్వ నిర్ణయాలకు అనుగుణంగా ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ గ్లాసుల వాడకం మానేయాలన్నారు. ఆర్డీఓ, తహసీల్దార్, ఫుడ్ సేఫ్టీ అధికారులతో ఒక కమిటీగా ఏర్పడి తనిఖీలు నిర్వహించేందుకు సమాయత్తమవుతున్నారని, ఉన్నతాధికారుల తనిఖీల్లో ఏదైనా హోటల్‌ను సీజ్ చేస్తే తిరిగి ఓపెన్ చేయించే పరిస్థితి ఉండదన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు వేగి శ్రీనివాసు, ఆకుల నాగు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణతంత్ర దినోత్సవం

ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల వద్ద సందడి



నరసాపురం: మున్సిపల్ కార్యాలయం ఆవరణలో జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం



నరసాపురం రూరల్: జెండా ఎగుర వేస్తున్న తహసీల్దార్ రాజకిషోర్



పెనుగొండ: ఎంపీడీఓ కార్యాలయం వద్ద సెల్యూట్ చేస్తున్న అధికారులు, విద్యార్థులు



పోడూరు: ఎంపీడీఓ కార్యాలయం వద్ద గణతంత్ర వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం: గణతంత్ర వేడుకలను పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో జాతీయజెండాలు ఆవిష్కరించారు. గణతంత్రస్ఫూర్తికి అనుగుణంగా ఉద్యోగులు పనిచేయాలని నరసాపురం ఆర్డీఓ దాసి రాజు సూచించారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో ఆయన జాతీయ జెండా ఆవిష్కరించి మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, నిర్ణయాలు, ఆశయాలు అమలు చేయాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందన్నారు. నరసాపురం డీఎస్పీ డాక్టర్ జి.శ్రీవేద తన కార్యాలయంలో జెండా ఆవిష్కరించారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో కమిషనర్ ఎం.అంజయ్య జెండా ఆవిష్కరణ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, వైఎస్ పాల్గొన్నారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో జరిగిన వేడుకల్లో రాజకీయవేత్త పరకాల ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని జెండాను ఎగురవేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు అందే రంగారావు, నెక్కంటి సుబ్బారావు పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ టి.రాజరాజేశ్వరి, ప్రభుత్వాసుపత్రిలో ఐసీటీసీ కౌన్సిలర్ జేసుప్రసాద్, వైఎన్ కళాశాలలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ, బీజీబీఎస్ మహిళా కళాశాలలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్, సూర్యా కళాశాలలో కరస్పాండెంట్ ఘంటశాల బ్రహ్మాజీ, గౌతమి కళాశాలలో చినిమిల్లి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో గణతంత్ర వేడకలు జరిగాయి.

నరసాపురం మండలంలో..

నరసాపురం రూరల్: 76వ గణతంత్ర దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ కె.రాజకిషోర్, జెడ్పీటీసీ సభ్యుడు బాపూజి గణతంత్ర వేడుకలు నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ త్రిశూలపాణి, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్సై జి.వాసు, పంచాయతీ కార్యాలయం వద్ద కార్యదర్శి ముచ్చర్ల నాగేశ్వరరావు, ప్రభుత్వ ఆసుపత్రి వద్ద డాక్టర్లు దినేష్, లక్ష్మీపార్వతి జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు కైలా సుబ్బారావు, కవురు సీతామహలక్ష్మి పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: భారత 76 గణతంత్ర దినోత్సవ వేడుకలు ఆదివారం వాడవాడలా ఉత్సాహంగా నిర్వహించారు. స్థానిక ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్‌రాజు కళాశాలలో పాలకవర్గ అధ్యక్షుడు తాడి నాగిరెడ్డి జెండా ఎగురవేశారు. సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కే రామచంద్రరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు ఉత్తమ విద్యార్థులకు బహుమతీ ప్రధానం చేశారు. తహసీల్దారు కార్యాలయం వద్ద తహసీల్దార్ జి.అనితకుమారి, ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీడీఓ టి.సూర్యనారాయణ మూర్తి, పెనుగొండ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ శాస్త్రి, కార్యదర్శి రత్నాకరరావు ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు నిర్వహించారు. ఇలపర్రులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు పులిదిండి వెంకటేశ్వరరావు, సంఘ పెద్దలు దిడ్ల ప్రసాద్, సాదే గోపాలం, ఇంజేటి కిషోర్ తదితరులు పూల మాల వేసి నివాళులర్పించారు. ఆచంట మండలంలో ఆచంట తహసీల్దారు కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయంల వద్ద వేడుకగా గణతంత్ర దినోత్సవ వేడకలు నిర్వహించారు. పోలీస్ స్టేషన్ వద్ద ఎస్సై వెంకటరమణ, గ్రామాల్లో గ్రామ కార్యదర్శులు పతాకావిష్కరణ చేశారు.

యలమంచిలిలో..

యలమంచిలి: భారత రాజ్యాంగం అమలుతో దేశంలో ఆర్థిక అసమానతలు, కుల వివక్షలకు అతీతంగా దేశ ప్రజలందరికీ సమాన హక్కులు లభించాయని తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్‌కుమార్ చెప్పారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆదివారం ఆయన ఎంపీడీఓ నందిపాటి ప్రేమాన్వితతో కలసి జాతీయజెండా ఎగురవేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ కొప్పాడి శ్రీనుబాబు, ఎంఈఓ కనుమూరు రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ వద్ద ఏఈ దున్న రాజీవ్, పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్సై కర్ణీడి గుర్రయ్య గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద గ్రామ కార్యదర్శులు, పాఠశాలల వద్ద ప్రధానోపాధ్యాయులు జాతీయజెండా ఎగురవేశారు. మేడపాడు సుజాత మాంటిస్సోరీస్ స్కూల్‌లో స్కూల్ చైర్మన్ కేవీ కృష్ణవర్మ ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు నిర్వహించారు.

పోడూరులో..

పోడూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆదివారం గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ బి.మంగాకుమారి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్, వైస్‌ఎంపీపీ ఇందుకూరి సీతారామరాజు, ఎంఈఓలు జి.విజయకుమార్, జి. సూర్యనారాయణ, గణపతినీడి రాంబాబు, రుద్రరాజు రమేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ సుధాకర్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.కవిటం గ్రామంలో పరకాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ భవనం వద్ద ఆదివారం గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రముఖ వైద్యుడు డాక్టర్ పోడూరి కృష్ణమూర్తి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ట్రస్ట్ చైర్మన్ పరకాల సూర్యమోహన్, కోశాధికారి పరకాల రాజేశ్వరరావు, పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: స్థానిక జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు క్యాంపు కార్యాలయంలో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. పోలీసుల గౌరవ వందనం మంత్రి రామానాయుడు స్వీకరించారు. పాలకొల్లు ప్రెస్‌క్లబ్ ఆవరణలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, మునిసిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ బి.విజయసారథి, రెవెన్యూ కార్యాలయం వద్ద తహసిల్దార్ యడ్ల దుర్గాకిషోర్, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ ఎన్ఎన్ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు నిర్వహించారు. భారతీయ విద్యాభవన్స్ వద్ద విద్యార్థులు పిరమిడ్ విన్యాసాలు చేసి అలరించారు. పాలకొల్లు రూరల్ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రేడ్ 1 పంచాయతీ కార్యదర్శి సీహెచ్ సత్తిబాబు, లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మెడికల్ ఆఫీసర్ డా.అడ్డాల ప్రతాప్‌కుమార్ పతాకావిష్కరణ చేశారు.

అంబేడ్కర్ ఆలోచనా విధానాలు స్ఫూర్తిదాయకం



పాలకొల్లు అర్బన్: అంబేడ్కర్, గాంధీజీ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న గుడాల శ్రీహరిగోపాలరావు

పాలకొల్లు అర్బన్: అంబేడ్కర్ ఆలోచనా విధానాలు భావి తరాలకు స్ఫూర్తిదాయకమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) అన్నారు. పాలకొల్లు యాళ్లవానిగరువు వైఎస్సార్ సీపీ కార్యాలయ ఆవరణలో 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు గోపి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జాతీయ పతాకాన్ని గోపి ఎగుర వేశారు. అలాగే వైఎస్సార్ సీపీ పతాకాన్ని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ ఎగుర వేశారు. బాబా సాహెబ్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మాగాంధీ చిత్రపటాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ అంబేడ్కర్ ఆలోచన విధానాలను అన్ని రంగాల్లో నూటికి నూరుశాతం అమలు చేసిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరేడు నెలల్లో ప్రజా ప్రయోజనాలు పూర్తిగా విస్మరించిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి కర్రా జయసరిత, వైఎస్సార్‌సీపీ నాయకులు బండి సుందరరామమూర్తి, నాయకులు పెదపాటి పెద్దిరాజు, గుర్రాల వెంకట్రావు, జోగాడ ఉమామహేశ్వరరావు, కొర్రగింజల శ్రీనివాస్, పాలపర్తి కృపానాథ్, చెన్ను విజయ్ పాల్గొన్నారు.

వేగంగా ఈ-పంట నమోదు



యలమంచిలి మండలం చించినాడలో ఈ పంట నమోదు చేస్తున్న రైతు సేవా కేంద్ర ఇన్‌చార్జి

యలమంచిలి: మండలంలో ఈ-పంట నమోదు కార్యక్రమం వేగంగా జరుగుతుంది. విత్తనాల ఎంపిక నుంచి పండించిన పంట మార్కెట్‌కు తరలించే వరకు అన్నదాతలకు అవసరమైన అన్ని రకాల సేవలు, సహాయం రైతు సేవా కేంద్రాల ద్వారా అందిస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, విపత్తులు ఏర్పడిన సమయంలో రైతులను ఆదుకునేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ-పంట నమోదు విధానాన్ని తీసుకువచ్చింది. ఈ విధానంలో రైతులు ఏ విధమైన పంట, ఎంత విస్తీర్ణంలో పండించారో స్పష్టంగా నమోదు చేస్తారు.

పంట నమోదులో పూర్తి పారదర్శకత..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ-పంట నమోదులో పూర్తి పారదర్శకత తీసుకొచ్చింది. పంట నమోదు యాప్‌లో రైతులు తాము సాగు చేసే భూమిలో ఎన్ని సర్వే నెంబర్లు ఉంటే అన్నీ యాప్‌లో నమోదు చేయించుకోవాలి. ఊడ్పులు పూర్తవ్వగానే ఆధార్, పంట రకం, విత్తిన తేదీ వివరాలను కొత్త యాప్‌లో నమోదు చేస్తారు. అనంతరం యాప్‌లో నమోదు చేసిన ప్రతి సర్వే నెంబర్ దగ్గరకు వెళ్లి జియో కోఆర్డినేట్స్ ద్వారా ఫోటో తీస్తారు. ఈ విధంగా రైతులు పంట నమోదు సక్రమంగా చేయించుకుంటేనే ప్రభుత్వం అందించే సబ్సిడీలు అందుతాయి.

రైతులకు అందే ప్రయోజనాలు..

రైతులు తమ పంట వివరాలను ఈ-పంట యాప్‌లో నమోదు చేయించుకోవడం వల్ల నష్టపరిహారం, గిట్టుబాటు ధర, సున్నా వడ్డీ, బ్యాంకు రుణాలు, ఎరువులు, పురుగు మందులు సరఫర, పెట్టుబడి సాయం మంజూరు, ఉచిత బోర్లు మంజూరు వంటి ప్రయోజనాలు పొందడానికి అవకాశం ఉంటుంది. ఈ-పంటలో భాగంగా రైతు సేవా కేంద్ర ఇన్‌చార్జ్ ప్రతి రైతు భూమి, గ్రామం, సర్వే నెంబరు, ఆధార్, పంట వివరం, నాట్లు వేసిన తేదీ వివరాలు నమోదు చేసి ఆన్‌లైన్ చేస్తారు. దీంతో పంట అమ్మే సమయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ సులభతరమవుతుంది.

37 శాతం పంట నమోదు..



మండలంలో మొత్తం 5911 ఎకరాలు ఉండగా ఇంతవరకు 2500 ఎకరాల వరకు ఊడ్పులు పూర్తయ్యాయి. ఊడ్పులు పూర్తవ్వగానే ప్రతి రైతు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేయించుకోవాలి. అయితే ఇప్పటి వరకు 1600 ఎకరాల వరకు పంట నమోదు చేశబ్యాం. ప్రతి రైతు తప్పనిసరిగా సంబంధిత రైతు సేవాకేంద్రంలో ఉన్నటువంటి రైతు సేవా కేంద్ర ఇన్‌చార్జ్ ద్వారా పంట నమోదు చేయించుకుని, వేలిముద్ర కూడా వేయాలి. ఈ పంటలో నమోదయిన రైతులకు మాత్రమే ప్రభుత్వం ద్వారా వచ్చే రాయితీలు వస్తాయి.

– శింగులూరి దేవి, మండల వ్యవసాయాధికారి

బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్ట్

పాలకొల్లు అర్బన్: మండలంలోని పూలపల్లిలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న జి.సుబ్బారావు అనే వ్యక్తిని ఆదివారం అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 9 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఎస్సైలు పి.మహేష్, జి.రఘులు మద్యం బెల్ట్ షాపు నిర్వాహకుడుపై దాడి చేసి పట్టుకున్నారని ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాసరావు తెలిపారు. పాలకొల్లు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు సాగిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

10 మద్యం బాటిళ్ల స్వాధీనం

పెనుగొండ: అక్రమంగా మద్యం కలిగి ఉన్న దేవ గ్రామానికి చెందిన మామిడి సత్యనారాయణను అరెస్ట్ చేసి 10 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొన్నట్లు తణుకు ప్రోహిబిషన్, ఎక్సైజ్ సీఐ ఎస్.మణికంఠ రెడ్డి తెలిపారు. ఆదివారం నిర్వహించిన నిందితుడు దాడుల్లో పట్టుబడినట్లు వివరించారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నరసాపురం ఆర్డీవో దాసి రాజు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ ఫిర్యాదులు, దరఖాస్తులు ఉదయం 10.30 గంటలు నుంచి అందించాలని కోరారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక సత్యవతినగర్ 11వ వార్డులోని ఏరియా ఆసుపత్రి వద్ద ఉన్న కనకమహాలక్ష్మి అమ్మవారి నూతన ఆలయంలో యంత్ర స్థాపన, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు సోమవారం నుంచి ఫిబ్రవరి 2వ తేదీ ఆదివారం వరకు నిర్వహిస్తారని ఆలయ కమిటీ అధ్యక్షుడు కాళ్ల గోపికృష్ణ, కార్యదర్శి యాదల శివాజీనాయుడు వెల్లడించారు.

వాహనదారులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన



పెనుగొండలో వాహనదారులకు అవగాహ కల్పిస్తున్న ఎస్సై గంగాధర్

పెనుగొండ: జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా పెనుగొండలో వాహనదారులకు ఎస్సై కె.గంగాధర్ అవగాహన కల్పించారు. ఆదివారం పెనుగొండ బజారులో వాహనదారులకు పలు సూచనలు చేశారు. ట్రాఫిక్ రూల్స్ పాటించి సురక్షితంగా గమ్యం చేరుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయవద్దన్నారు. వాహనాల రిజిస్ట్రేషన్ నంబరు స్పష్టంగా కనిపించేలా ఉంచాలన్నారు.

డాక్టరేట్ పొందిన శ్రీదేవికి సత్కారం



కాజలో ఉపాధ్యాయిని యనమదల శ్రీదేవిని సన్మానిస్తున్న సర్పంచ్ పాలంకి శ్రీనివాసరావు

యలమంచిలి: కాజ పడమర గ్రామంలోని అంబాల చెరువు గట్టు పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న యనమదల శ్రీదేవి కవితలు రాస్తుంటారు. విద్యార్థులకు బోధించే విధానంలో కూడా వినూత్న విధానాలను అనుసరిస్తారు. ఆమె ప్రతిభను గుర్తించిన అమెరికాకు చెందిన డైస్ప్రింగ్ యూనివర్సిటీ ఆమెకు హానరరీ డాక్టరేట్ అందించింది. గత నెలలో ఆమె హైదరాబాద్ రవీంద్ర భారతిలో డాక్టరేట్ అందుకున్నారు. ఆమె ప్రతిభకు గతంలో మెగా హెల్పింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇండియన్ వావ్ టాలెంట్ అవార్డు, శివ నంది అవార్డులు కూడా వచ్చాయి. ఈ సందర్భంగా ఆదివారం పాఠశాలలో ఆమెను విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో స్థానిక సర్పంచ్ పాలంకి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ కోడెల్లి లీలాకుమారి బుజ్జిబాబు, సంఘ పెద్దలు దిగమర్తి ధర్మారావు, బాలంగోపాలం సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిషోర్, డిజిటల్ అసిస్టెంట్ హరి, వెల్ఫేర్ అసిస్టెంట్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మంచు సోయగం

గ్రామాల్లో పొగ మంచు సోయగం ఆకట్టుకుంటుంది. ఉదయం 9 గంటలైన సూర్యుడు కనిపించనంతగా పొగ మంచు కమ్మేస్తుంది. ఉదయమే ప్రకృతి రమణీయ దృశ్యాలు ఆకట్టుకుంటున్నాయి. అయితే ఈ పొగ మంచుతో రైతులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు. ప్రకృతి ప్రేమికులు మాత్రం పొగ మంచు అందాలను తమ ఫోన్స్‌లో ఫొటోలు తీసుకుని సోషల్ మీడియాలో షేర్ చేసుకుంటున్నారు. ఆదివారం పెనుగొండ, మొగల్తూరు మండలాల్లో కనిపించిన దృశ్యాలివి.

పెనుగొండ/నరసాపురం రూరల్



దొంగరావిపాలెం వద్ద జాతీయ రహదారిలో దట్టమైన మంచు



మంచు ముసుగులో 102 అడుగుల రుషీ గోత్ర మందిరం



మొగల్తూరు ప్రధాన రహదారిని కమ్మేసిన మంచు



మంచులోనే కూరగాయలను ఎగుమతి చేస్తున్న కూలీలు